ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

22-04-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 115 | పేజీలు-04 | వెల-రూ.1

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD | బుధవారం | WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్



## రహస్యమేమీ లేదు

- న్యాయనిపుణులతో చర్చకే ఢిల్లీకి
- తేల్చేసిన హరీష్ రావు

02



## బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్లారా చూడాలి

- ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

02



## ఫ్రీ బస్సు పథకం రద్దు చేస్తామని ప్రకటించే దమ్ముందా?

- కేసీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్

02

# కవిత ఇంపాక్ట్



## తెలంగాణ పాలిటిక్స్‌లో.. నయా అజెండా

సామాజిక తెలంగాణ.. బిసి అస్త్రం.. ఉద్యమకారుల గుర్తింపు

మహిళలు, యువతే టార్గెట్

మమత, జయలలిత తరహాలో ప్రభావం పక్కా అంటున్న అభిమానులు

బీఆర్ఎస్ కు ప్రధాన గండిపడే అవకాశం

ఇప్పటికే కండువాకప్పుకున్న మాజీ ఎమ్మెల్యే బాపూరావు..
అదే బాటలో పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు

ఎన్నికల నాటికి పలువురు సిట్టింగ్ లు చేరే ఛాన్స్

(హైదరాబాద్ - మహా)

తెలంగాణ పాలిటిక్స్ పై కల్వకుంట్ల కవిత పార్టీ ప్రభావం బలంగా ఉండేలా వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేశారు. కేసీఆర్ నుండి పుణికిపుచ్చుకున్న మొండిపట్టుదలతోనే.. పార్టీని విజయవంతం చేసి తీరుతామని, బీఆర్ఎస్ చేసిన తప్పిదాలు చేయకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీని కవిత నడిపితీరుతుందని మద్దతుదారులు ధీమాగా ఉన్నారు. గత కొద్దిరోజులుగా కవిత సెట్ చేసిన ఎజెండా, ఎంచుకున్న అంశాలు స్టేట్ పాలిటిక్స్ లో హాట్ డిస్కషన్ కు తెరతీయగా, ఇపుడు కవిత పార్టీ ఆవిర్భావానికి సమయం ఆసన్నం కావడంతో ఆసక్తి ఏర్పడింది. తెలంగాణ జాగృతి స్థాపించి.. తెలంగాణ వ్యాప్తంగా కమిటీలు, కార్యాచరణతో ఉద్యమాన్ని ఉత్తేజితం చేసిన కవిత.. ఇపుడు పొలిటికల్ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు. ఏప్రిల్ 25న పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించబోతున్నారు. ఇది దాదాపుగా పసుపు, కుంకుమ రంగుల కలయికతో కవిత పార్టీ రాబోతున్నట్లు చర్చ జరుగుతోంది. ఆమె పార్టీ ఎలా ఉండబోతోంది, పార్టీ ప్రకటన సందర్భంగా ఏయే అంశాలను ప్రస్తావించబోతున్నారు.. తన పార్టీ తెలంగాణలోని ఏ పార్టీకి ప్రత్యామ్నాయం కాబోతుందనేది ఉత్కంఠ రేపుతోంది.

మిగతా 2లో

### కాంగ్రెస్, బీజేపీ నుంచి కూడా చేరికలు

అధికార కాంగ్రెస్ తో పాటు.. బీజేపీ నుంచి కూడా కవిత పార్టీలోకి చేరికలు ఉంటాయని.. ఆమె వర్గం నేతలు ప్రచారం చేస్తున్నారు. అలాగే పదవులు దక్కకపోవడంతో కాంగ్రెస్ లో అసంతృప్తితో ఉన్న నేతలపైనా కవిత దృష్టి సారించినట్లు చెప్తున్నారు. నిజానికి రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత నుంచే.. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలతో కవిత సంప్రదింపులు జరుపుతూ వస్తున్నారని.. ఆమె వర్గం నేతలు అంటున్నారు. సీనియర్లతో సహా.. చాలామంది యువ నాయకులు కూడా తమ పార్టీలో చేరతారనే నమ్మకంతో కవిత ఉన్నారని తెలుస్తోంది. ఏప్రిల్ 25, ఆ తర్వాత కవిత ఇంపాక్ట్ స్పష్టం కానుంది.

### వెయ్యేళ్లయినా బీఆర్ఎస్ మారదు

- వారిని ఓడించడం ప్రజలదే తప్పా?
- 75 ఏళ్ళ కురువృద్ధుడు నవయువకుడయ్యాడా?
- కేసీఆర్ పై కల్వకుంట్ల కవిత ఫైర్
- కొత్త రాజకీయశక్తిగా వస్తున్నాం.. ఆశీర్వదించండి
- హరీష్, రేవంత్ ఇద్దరూ ఒకటే

వివరాలు 2లో



## బెంగాల్ పై సట్టాబజార్ లెక్క ఇదే..

### హోరాహోరీ

**మహా :** సట్టా బజార్ అంచనాల ప్రకారం బెంగాల్లో టీఎంసీ, బీజేపీ మధ్య ఊహించని గట్టి పోటీ నెలకొంది. ఇందులో టీఎంసీకి 158161 సీట్లు, బీజేపీకి 127130 సీట్లు, ఐఎన్‌సీకి 46 సీట్లు వస్తాయని అంచనా వేసింది. సట్టాబజార్ ను మార్కెట్లో అత్యంత బలమైన అంచనాగా భావిస్తుంటారు. ఈ లెక్కన టీఎంసీ సాధారణ మెజారిటీని దాటుతుంది, కానీ అతి కష్టం మీద. అదే సమయంలో, రాష్ట్రంలో బీజేపీ తన చరిత్రలోనే అత్యంత బలమైన ప్రదర్శనను

మిగతా 2లో



## పులివెందులలో వైఎస్ జగన్

### నేడు 'ప్రజాదర్బార్'

**పులివెందుల,మహా:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన సొంత నియోజకవర్గం పులివెందులకు చేరుకున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు కడప విమానాశ్రయం నుంచి పులివెందుల మార్గమంతటా పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం సుమారు 4 గంటలకు భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్న జగన్, ఏమాత్రం

మిగతా 2లో



## పిఠాపురంలో 'ఫ్లెక్సీ' చిచ్చు

### వర్మపై జనసేన దాడి యత్నం

### వర్మ వర్సెస్ దొరబాబు

**పిఠాపురం,మహా:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గంలో తెలుగు దేశం మరియు

మిగతా 2లో

# ఆగిన బస్సు చక్రం

### ఆర్టీసీ చర్చలు విఫలం..

### 9,200 బస్సుల రాకపోకలు బంద్

### కోటి మంది ప్రయాణికులకు ఇక్కట్లు




**హైదరాబాద్, మహా:**

రాష్ట్ర ప్రభుత్వం , ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ మధ్య సుదీర్ఘంగా జరిగిన చర్చలు ఎటువంటి కొలిక్కి రాకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిగిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. కార్మికులు కోరుతున్న 32 డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో పాటు, సమస్యల పరిష్కారానికి మరో నాలుగు వారాల సమయం కోరడాన్ని జేఏసీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు గడిచినా కాలయాపన చేయడం సమంజసం కాదని నిరసిస్తూ, బుధవారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రవ్యాప్తంగా బస్సులను డిపోలకే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులు ఒక్కసారిగా రవాణా గండంలో చిక్కుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుండి సమ్మె ప్రారంభం కాగా, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

### సామాన్యులపై ప్రభావం

ఆర్టీసీ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల జీవనగమనంపై తీవ్ర ప్రభావం చూపనుంది. అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 9,200 బస్సులు వివిధ రూట్లలో రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి'

మిగతా 2లో

# అభిషేక్ సునామీ..

### ఉప్పల్‌లో ఫోర్ల వాన, సిక్సర్ల తుపాను.. కోహ్లీ రికార్డు బద్దలు..

### ఆరెంజ్ క్యాప్‌తో అభిషేక్ శర్మ వీరవిహారం.. ఢిల్లీపై సన్‌రైజర్స్ ఘనవిజయం



**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలోని ఉప్పల్ స్టేడియం మంగళవారం రాత్రి పరుగుల వరదలో తడిసి ముద్దయింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ 'కాటేరమ్మ కొడుకు'లా విశ్వరూపం ప్రదర్శించాడు. మైదానం నలుమూలలా ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ ఢిల్లీ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. కేవలం 47 బంతుల్లోనే శతక్కొట్టిన అభిషేక్, అజేయంగా 135 పరుగులు చేసి సన్‌రైజర్స్‌కు కొండంత స్కోరును అందించడమే కాకుండా జట్టుకు 47 పరుగుల అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో రెండు సెంచరీలు సాధించిన తొలి భారతీయ బ్యాటర్‌గా అభిషేక్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలిని చూస్తుంటే రాబోయే టి20 ప్రపంచ కప్‌లో భారత జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నట్లే కనిపిస్తోంది. టాస్ గెలిచిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టుకు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. మొదటి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డ అభిషేక్ ఏ బౌలర్‌ను కూడా విడిచిపెట్టలేదు. విరాట్ కోహ్లీ 2016 సీజన్‌లో నెలకొల్పిన విధ్వంసకర వేగాన్ని తలపిస్తూ ముఖ్యంగా స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని అభిషేక్ ఆడిన షాట్లు స్టేడియంలోని అభిమానులను మంత్రముగ్ధులను చేశాయి.

మిగతా 2లో

# అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు




### వరంగల్ లో భారీగా హాష్ ఆయిల్ పట్టివేత

### రూ.2.50 కోట్ల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం

### నలుగురు నిందితులు అరెస్ట్ జైలుకు తరలింపు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు మరోసారి సత్తా చాటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు భారీ హాష్ ఆయిల్ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత ఖరీదైన 'హాష్ ఆయిల్' గంజాయి నుంచి తీసిన నూనె తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 20 కిలోల హాష్ ఆయిల్ను స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో

## డీల్ కుదరకపోతే యుద్ధమే..

- ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్



02

# కవిత ఇంపాక్ట్

(మొదటిపేజీ తరువాయి)

కవిత.. ఆదినుండీ బలమైన అంశాలతో తన గళాన్ని వినిపించారు. ఇపుడు సామాజిక తెలంగాణ, బీసీ అస్త్రం, ఉద్యమకారుల గుర్తింపు, యువత, మహిళలకు రాజకీయాల్లో ప్రధాన వాటా ఇచ్చేలా ఎజెండా సెట్ చేస్తున్నారు. ఒక పవర్ ఫుల్ మహిళ పార్టీ నడిపితే ఎలా ఉంటుందో.. కవిత ద్వారా తెలంగాణ ప్రజలు చూస్తారని మద్దతుదారులు అంటున్నారు. ఒక ఇందిర, మమత, జయలలిత వంటి మహానేతల పట్టుదల కవితలో చూస్తున్నామని, తెలంగాణ పాలిటిక్స్ భవిష్యత్ లో కవిత కేంద్రంగానే ఉంటాయని చెబుతున్నారు.

**కవిత పార్టీలో ఎవరెవరు చేరబోతున్నారనే ఆసక్తి..**

అడుగులు.. లక్ష్యాలు.. విధివిధానాల సంగతి ఎలా ఉన్నా.. కవిత ప్రకటించబోతున్న రాజకీయ పార్టీలో ఎవరెవరు చేరబోతున్నారనేది ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. తెలంగాణ ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నుంచి పలువురు నేతలు .. తన పార్టీలో చేరతారని కవితతో పాటు జాగృతి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి కూడా చాలామంది నాయకులు తనకు టచ్ లో ఉన్నారని అంటున్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలతో పాటు.. బీఆర్ ఎస్ ముఖ్య నేతలు కూడా తమ పార్టీలోకి వస్తామనే సంకేతాలు పంపుతున్నారని ప్రచారం చేస్తున్నారు. ఇది తెలంగాణ రాజకీయాన్ని మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. పార్టీ ఆవిర్భావానికి ముందే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరగా, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు కవితకు టచ్ లో ఉన్నారు. కొందరు పార్టీ ఆవిర్భావం రోజు, మరికొందరు తర్వాత చేరనున్నారు. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎన్నికల ఏడాది వస్తామని హామీనిచ్చినట్లు తెలుస్తోంది.

**బీఆర్ఎస్ నుంచి మెజారిటీ నాయకులను లాగే ప్రయత్నం**

కవిత ప్రకటించబోయే రాజకీయ పార్టీలోకి.. ఏయే పార్టీ నుంచి ఎవరెవరు వెళ్తారనే దానిపై పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చర్చ నడుస్తోంది. తన తండ్రి పార్టీ బీఆర్ఎస్ నుంచి మెజారిటీ నాయకులను.. తనవైపు తిప్పుకొనే ప్రయత్నం కవిత చేయవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్న వేళ.. కారు పార్టీ నుంచి ఎవరెవరు వెళ్తారనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. గులాబీ పార్టీలో చాలామంది నేతలతో.. కవితకు మంచి అనుబంధం ఉంది. గతంలో చాలామంది నాయకులతో ఆమె కలిసి పనిచేశారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేసిన తర్వాత కూడా.. ఆ పార్టీ నేతలతో కవిత మంచి సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్ నుంచి చాలామంది నేతలు, కార్యకర్తలు తన పార్టీలోకి వస్తారని కవిత భావిస్తున్నారని తెలుస్తోంది. పార్టీలో అసంతృప్తులు, గతంలో టికెట్ ఆశించి భంగపడిన వాళ్లను.. కవిత టార్గెట్ చేసే అవకాశాలు ఉన్నాయనేది వినబడుతోంది. తాజాగా కేసీఆర్ జగిత్యాల సభ భారీ చేరికలకు కొంత బ్రేకులు వేసినా, ఇవి ఆగే అవకాశం లేదని అంటున్నారు. బీఆర్ఎస్ వెయ్యేళ్లైనా మారదని, ప్రజలదే తప్పు అంటూ తమ తప్పులను బీఆర్ఎస్ ప్రజలమీద వేయడంపై కవిత మండిపడ్డారు.

# వెయ్యేళ్లయినా బీఆర్ఎస్ మారదు

- వారిని ఓడించడం ప్రజలదే తప్పా?
- 75 ఏళ్ళ కురువృద్ధుడు నవయువకుడయ్యాడా?
- కేసీఆర్ పై కల్వకుంట్ల కవిత ఫైర్
- కొత్త రాజకీయశక్తిగా వస్తున్నాం.. ఆశీర్వదించండి
- హరీష్, రేవంత్ ఇద్దరూ ఒకటే




**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక మలుపునకు సమయం ఆసన్నమైందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఈ నెల 25వ తేదీన ఒక నూతన రాజకీయ శక్తి ఆవిర్భవించబోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వెయ్యేళ్లు గడిచినా భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) తన తీరు మార్చుకోదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకపోగా ప్రజలనే తప్పు పట్టే స్థాయికి దిగజారడం దురదృష్టకరమని ఆమె మండిపడ్డారు. ఓటమిపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సింది పోయి, ప్రజలను చులకన చేస్తూ మాట్లాడటం బీఆర్ఎస్ అహంకారానికి పరాకాష్ట అని ఆమె ధ్వజమెత్తారు. ప్రజల కోసం నిలబడే ఒక ఆడబిడ్డగా తాను ఈ నెల 25న కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్నానని, ప్రజలంతా తరలివచ్చి ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకే 25 ఏళ్లు తగ్గిపోయాయని, ఆయనో నవ యువకుడని వర్ణించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. మరి తెలంగాణలో ఉన్న కోట్లాది మంది నిరుద్యోగ యువత పరిస్థితి ఏమిటని ఆమె నిలదీశారు. జగిత్యాల సభ సాక్షిగా తెలంగాణ వ్యతిరేక శక్తులను అక్కున చేర్చుకోవడం ద్వారా బీఆర్ఎస్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటోందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని, ఉద్యమ కాలంలో పదవులకు రాజీనామా చేయమంటే వైఎస్ నాయకత్వమే ముద్దని అన్న వ్యక్తిని ఇప్పుడు నెత్తిన పెట్టుకోవడం ఉద్యమకారులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం రక్తం చిందించిన ఉద్యమకారులు నేడు భిక్షాటన చేసే స్థితికి వచ్చినా, బీఆర్ఎస్ నాయకత్వం వారి గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. జాతీయ రాజకీయాల గురించి గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్, లోక్‌సభలో మహిళా బిల్లు వీగిపోయినా, డీలిమిటేషన్ మరియు జనగణనపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తున్నా పల్లెత్తు మాట అనకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని కవిత ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో ఆడబిడ్డలకు ఎప్పుడూ గౌరవం ఉండదని, అందుకే మహిళా రిజర్వేషన్లపై వారి గొంతు పెగలడం లేదని ఆరోపించారు. ఒకవైపు బీఆర్ఎస్ 'ఉత్తి కథలు' చెబుతుంటే, మరోవైపు కాంగ్రెస్ 'పిట్టకథలు' చెబుతూ కాలక్షేపం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి, కేవలం బలప్రదర్శనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. 'నువ్వు ఎంత అంటే..నేను అంత' అనే చందంగా సాగుతున్న ఈ రాజకీయాలకు స్వస్తి పలకాలని, అందుకే తాము ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా కొత్త రాజకీయ శక్తితో వస్తున్నామని స్పష్టం చేశారు.

**గుంటనక్క.. గుంపుమేస్త్రీ బంధం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కూడా కవిత నిప్పులు చెరిగారు. కోర్టు తీర్పులను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కేసులో ఫలానా తీర్పు వస్తుందని ముఖ్యమంత్రి ముందే ఎలా చెబుతారని, ఇది రాజ్యాంగబద్ధ సంస్థలను తక్కువ చేయడమేనని నిలదీశారు. ఢిల్లీలో 'గుంటనక్క' ఎవరిని కలిసిందో చెప్పాలని, అసలు గుంపుమేస్త్రి సీఎంకి ఆ గుంటనక్కతో ఉన్న 'డీల్' ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రతిపక్షం లేకుండా చేస్తాననడానికి రేవంత్ రెడ్డి ఎవరని, ఎవరు ప్రతిపక్షంలో ఉండాలో నిర్ణయించేది ప్రజలని ఆమె గుర్తు చేశారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న ధీమా ఎక్కడిదని, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా, రైతు భరోసా పూర్తి చేయకుండా ప్రజలు మళ్ళీ ఎందుకు ఓట్లు వేస్తారని ఆమె ప్రశ్నించారు.హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడం, సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం వంటి చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురవుతోందని కవిత హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని ప్రకటించారు. ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరగబోయే తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, యువత భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సిరిసిల్ల నుంచి ఇప్పటికే కార్యకర్తలు పాదయాత్రగా బయలుదేరారని, వచ్చే కార్యకర్తలను ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని పోలీసులను కోరారు. సమస్యలు ఉన్నచోట పోరాటమే లక్ష్యంగా తమ ప్రస్థానం సాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# అభిషేక్ సునామీ..

(మొదటిపేజీ తరువాయి)

నితీష్ రాణా వేసిన ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాది తన సెంచరీని పూర్తి చేసిన తీరు ఆరెంజ్ ఆర్మీని ఉర్రూతలూగించింది. 10 ఫోర్లు, 10 సిక్సర్లతో విరుచుకుపడిన ఈ యువ సంచలనం 68 బంతుల్లో 135 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విరాట్ కోహ్లీ గతంలో నెలకొల్పిన స్ట్రైక్ రేట్ రికార్డులను కూడా ఈ మ్యాచ్‌తో తుడిచిపెట్టడమే కాకుండా ఒకే ఐపీఎల్ సీజన్‌లో రెండు కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన అతికొద్ది మంది భారతీయ బ్యాటర్ల జాబితాలో అభిషేక్ చేరాడు.అభిషేక్ శర్మ సెంచరీ చేసిన తర్వాత తన రెండు చేతులను కట్టుకుని చేసిన 'కోల్డ్ సెలబ్రేషన్' ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రత్యేక వేడుక వెనుక ఉన్న రహస్యాన్ని మ్యాచ్ అనంతరం అతడు వెల్లడిస్తూ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్, మురళీధరన్ తనను 20వ ఓవర్ వరకు క్రీజులో ఉండాలని సూచించారని, ఆ మాటను నిలబెట్టుకుని చివరి వరకు బ్యాటింగ్ చేసినందుకు గుర్తుగానే అలా వేడుక చేసుకున్నట్లు తెలిపాడు. తన కెరీర్‌లో పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేయడం ఇదే మొదటిసారి అని హోమ్ గ్రౌండ్‌లో ఈ ఘనత సాధించడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు. ఈ ఇన్నింగ్స్ తో 323 పరుగులకు చేరుకున్న అతడు ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా సన్‌రైజర్స్ తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ మొదట్లో ధాటిగానే ఆడినా హైదరాబాద్ బౌలర్ల వ్యూహాల ముందు తలవంచక తప్పలేదు. నితీష్ రాణా 57 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఇతర బ్యాటర్లు అతనికి సహకరించలేదు. హైదరాబాద్ బౌలర్లలో ఈషన్ మలింగ తన వేగంతో మాయాజాలం చేస్తూ 4 వికెట్లు పడగొట్టగా హర్ష్ దూబే కీలకమైన 3 వికెట్లు తీసి ఢిల్లీ పతనాన్ని శాసించాడు. దిల్షాన్ మధుశంక, సాకిబ్ హుస్సేన్ కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 195 పరుగులకే పరిమితమైంది. వరుస విజయాలతో జోరు మీదున్న సన్‌రైజర్స్ ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లి ప్లే ఆఫ్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. ఢిల్లీ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన అభిషేక్ ప్రదర్శనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# డీల్ కుదరకపోతే యుద్ధమే..

## ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్:** ఇరాన్‌తో ఒక ఒప్పందం (డీల్) కుదరని పక్షంలో తాము యుద్ధానికి వెనుకాడబోమని, ఇందుకు అవసరమైన అత్యంత శక్తివంతమైన ఆయుధాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభించకపోతే, ఆ తర్వాతి పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న కాల్పుల విరమణ సమయాన్ని అమెరికా వృథా చేయలేదని, ఈ కాలంలోనే తమ సైనిక శక్తియుక్తులను మరింతగా కూడగట్టుకుని, యుద్ధ తంత్రాన్ని పటిష్టం చేసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌ను ఆర్థికంగా, వ్యూహాత్మకంగా దెబ్బతీయడంలో భాగంగా ఆ దేశ పోర్టులను దిగ్బంధించడం అమెరికా సాధించిన అతిపెద్ద విజయమని ట్రంప్ అభివర్ణించారు. ఈ ఆర్థిక దిగ్బంధం వల్ల ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని, తమ వ్యూహాలు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని ఆయన విశ్లేషించారు. అయితే, ఎటువంటి ఒప్పందం లేకుండా కాల్పుల విరమణను నిరవధికంగా కొనసాగించే ఉద్దేశం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ప్రయోజనాలకు లోబడి ఉండేలా ఒక పటిష్టమైన డీల్ కుదిరితేనే శాంతి సాధ్యమవుతుందని, లేదంటే ఆయుధాలే సమాధానం చెబుతాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. శాంతి, భద్రత మరియు రక్షణ అనేవి కేవలం ఒక సక్రమమైన ఒప్పందం ద్వారానే లభిస్తాయని ఆయన ఇరాన్ పాలకులకు గుర్తు చేశారు.మరోవైపు, యుద్ధ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఇరాన్ కోసం తాము ఒక అద్భుతమైన 'డీల్' సిద్ధం చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం విశేషం. ఈ ఒప్పందం ఇరాన్‌కు మాత్రమే కాకుండా, మొత్తం ప్రపంచానికే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యావత్ ప్రపంచమే తమ చారిత్రాత్మక ఒప్పందాన్ని చూసి గర్వపడుతుందని, అది ప్రపంచ శాంతికి బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవైపు ఆయుధాలను చూపిస్తూనే, మరోవైపు చర్చల ఆహ్వానాన్ని పలకడం ద్వారా ట్రంప్ తన విలక్షణమైన దౌత్య నీతిని ప్రదర్శించారు. ప్రస్తుతానికి బంతి ఇరాన్ కోర్టులోనే ఉందని, వారు శాంతిని కోరుకుంటారో లేక వినాశనాన్ని ఆహ్వానిస్తారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ చేసిన ఈ సంచలన ప్రకటనతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నట్లయింది.

# ఆగిన బస్సు చక్రం

(మొదటిపేజీ తరువాయి)

ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. సాధారణ రోజుల్లో 95 లక్షల నుంచి 97 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలపై ఆధారపడుతున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా బస్సులు నిలిచిపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం రాకపోకలు సాగించే 32 లక్షల మంది ఉద్యోగులు, విద్యార్థులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మరోవైపు గ్రామాల్లోని పేద ప్రజలకు ఆర్టీసీనే ఏకైక ఆధారమైన తరుణంలో, ఈ సమ్మె గ్రామీణ రవాణా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయనుంది. ఆర్థికంగా అట్టడుగున ఉన్న టీజీఎస్ఆర్టీసీకి ఈ సమ్మె కోలుకోలేని దెబ్బ కానుంది. ఒక్క రోజు బస్సులు తిరగకపోతే సంస్థకు సుమారు 18 కోట్ల నుంచి 20 కోట్ల రూపాయల వరకు ఆదాయ గండి పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేవలం ప్రయాణ చార్జీల రూపంలోనే కాకుండా, కార్గో సేవలు మరియు ఇతర వాణిజ్య ఆదాయం కూడా నిలిచిపోవడంతో ఆర్థిక భారం మరింత పెరగనుంది. ఇప్పటికే వేల కోట్ల అప్పుల్లో ఉన్న సంస్థకు, ఈ సమ్మె కారణంగా వచ్చే నష్టాలను పూడ్చుకోవడం పెను సవాలుగా మారనుంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ , ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయడం వంటి డిమాండ్లపై కార్మికులు పట్టుబడుతున్నారు. ప్రభుత్వం జాప్యం చేస్తున్న కొద్దీ ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది చివరకు సంస్థ మనుగడకే ప్రమాదకరంగా మారుతుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రత్యామ్నాయాలపై సర్కారు దృష్టి

కార్మిక నేతలు ఈసారి సమ్మెను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 2011 నాటి సకల జనుల సమ్మెను తలపించేలా రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు డ్రైవర్లు, కండక్టర్లు మరియు మెకానిక్ విభాగం వారు కూడా విధులను బహిష్కరించడంతో డిపోలన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు నడపాలని, స్కూలు బస్సులు మరియు ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించింది. అయితే సుమారు 3,600 పైగా రూట్లలో నిత్యం నడిచే భారీ నెట్‌వర్క్‌ను ప్రైవేటు సిబ్బందితో భర్తీ చేయడం అసాధ్యమని స్పష్టమవుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య సామాన్య ప్రయాణికుడు బలికాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ సమ్మె కేవలం రవాణా సమస్యే కాకుండా రాజకీయంగా కూడా వేడి పుట్టిస్తోంది. ప్రభుత్వం మరియు కార్మికుల మధ్య నెలకొన్న ఈ ప్రతిష్టంభన ఎప్పటికి తొలగుతుందనేది ఇప్పుడు అటు పాలక వర్గాల్లోనూ, ఇటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు ఆటోలు, ట్యాక్సీల యజమానులు ఇదే అదనుగా ప్రయాణికుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యావసర వస్తువుల రవాణాపై కూడా ఈ ప్రభావం పడటంతో ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏది ఏమైనా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడం రాష్ట్ర ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘాలతో మరోసారి చర్చలు జరిపి, రవాణా చక్రం మళ్ళీ సాఫీగా సాగేలా చూడాలని సామాన్యులు కోరుకుంటున్నారు.

# అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

దీని అంతర్జాతీయ మార్కెట్ విలువ సుమారు రూ. 2.50 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ కేసు పూర్తి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు.

**అరెస్టు అయిన వారి వివరాలు**

ఒడిషా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లాకు చెందిన హంటల్ సన్ను (23), హంటల్ సన్యాసి (23), కృష్ణా హంటల్ (56)లతో పాటు ఏపీలోని అల్లూరి జిల్లాకు చెందిన కందెల చిన్నబాబు (56) ఉన్నారు. మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలోనే గంజాయి సాగు చేస్తూ, దాని ద్వారా వచ్చే ఆదాయంతో జల్సాలు చేసేవాడు. కాగా గంజాయి అమ్మడం కంటే దాని నుంచి తీసే హాష్ ఆయిల్ కు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో, నిందితుడు పాండు సూచన మేరకు గంజాయి మొక్కల నుండి ఆయిల్ సేకరించడం ప్రారంభించారు. ఓ ప్రత్యేక పరికరం ద్వారా 40 కిలోల హాష్ ఆయిల్ను సేకరించగా, అందులో 20 కిలోలను పాండు తీసుకున్నాడు. మిగతా 20 కిలోలను ఒక్కో కిలో ప్యాకెట్ల చొప్పున ప్యాక్ చేసి ముంబైలో విక్రయించేందుకు నిందితులు ప్లాన్ చేశారు. ఈ నెల 19న తుని రైల్వే స్టేషన్ నుండి కోనార్క్ ఎక్స్ప్రెస్లో నిందితులు ముంబై బయలుదేరారు. అయితే వరంగల్ స్టేషన్లో తనిఖీలు జరుగుతున్నాయనే అనుమానంతో ఇక్కడే దిగిపోయారు. మంగళవారం ఉదయం వరంగల్ బస్టాండ్ సమీపంలోని రైల్వే గూడ్స్ షెడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద ఉన్న 20 కిలోల హాష్ ఆయిల్ బయటపడింది. భారీ స్థాయిలో డ్రగ్స్ పట్టుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఇన్స్ స్పెక్టర్లు సతీష్, షూకూర్, ఎస్ఐలు సందీప్, తేజ, ఆర్ఎస్ఐ లు ఏ.పూర్ణ చందర్ రెడ్డి, కె. మనోజ్ రెడ్డి, ఎల్.లింగారావు, క్యాట్ పార్టీ ఏఆర్ ఏఎస్ఐలు వి.సుబ్బిరామి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు బాల రాజు, కె.శ్రీరాములు, యం.డి రబ్బానీ, ఆర్.రాజ్కుమార్తో పాటు ఇంతేజార్గంజ్ సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

# బెంగాల్ పై సట్టాబజార్ లెక్క ఇదే

(మొదటిపేజీ తరువాయి)

కనబరుస్తుందని అంచనా. బీజేపీ గరిష్ట అంచనాకు, టీఎంసీ కనిష్ట అంచనాకు మధ్య అంతరం కేవలం 28 సీట్లే ఉండటం, తుది ఫలితంపై నెలకొన్న తీవ్రమైన ఉత్కంఠకు అద్దం పడుతోంది. పశ్చిమబెంగాల్లో ఈసారి తృణమూల్ కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతకు తోడు భారీ ఎత్తున ఈసీ తొలగించిన ఓట్ల ప్రభావం కూడా ఎన్నికలపై పడుతోంది. దీంతో బీజేపీ భారీ ప్రయోజనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే బీజేపీ బంగ్లాదేశ్ వలసలపై చేస్తున్న ప్రచారం ప్రభావం కూడా ఎన్నికల్లో కనిపిస్తోంది. అయినా మమత సర్కార్ పకడ్బందీగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభావంతో నాలుగోసారి కూడా విజయం సాధించే అవకాశాలు ఉన్నట్లు అర్థమవుతోంది. బెంగాల్లో గురువారం తొలి దశ ఎన్నికలు జరగనుండగా.. ఈ నెల 29న రెండో దశ ఎన్నికలు జరుగుతాయి.

# బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్లారా చూడాలి

## ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కేసీఆర్, రేవంత్ లు.. వీరిద్దరికీ లాగుల మీదే ప్రేమ. ఒకాయన లాగుల్లో తొండలు విడుస్తా అంటాడు.. మరొకాయన లాగులు పగిలే దాకా కొట్టాలంటాడు' అని బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సెటైర్స్ వేశారు. కేసీఆర్ చనిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని, ప్రపంచస్థాయిలో ట్రంప్, రాష్ట్రస్థాయిలో కేసీఆర్ వల్లే మంచి ఎంటర్టైన్‌మెంట్ ఉందన్నారు. ఆయన వందేళ్లు బతకాలని, బీఆర్ఎస్ చావును కేసీఆర్ కళ్ళారా చూడాలని అన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు ఆడారని అర్వింద్ విమర్శించారు. కేసీఆర్‌ను కేటీఆర్, కవితలే ఎక్కువగా హింసిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుంది అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# ఫ్రీ బస్సు పథకం రద్దు చేస్తామని ప్రకటించే దమ్ముందా?

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్

**హైదరాబాద్, మహా:** ఫ్రీ బస్ పథకాన్ని పనికిమాలినదిగా అభివర్ణించడం దొరతనానికి నిదర్శనమని, వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఉచిత బస్ ప్రయాణ పథకంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, మహిళా లోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు అన్నారు. నిజంగా ఈ పథకం పనికిరాదని భావిస్తే, దాన్ని రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా సూటి ప్రశ్న వేశారు. ఈ ఉచిత బస్ పథకం ద్వారా లక్షలాది మహిళలు ప్రతి రోజు ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుంటూ, ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సేవలు సులభంగా పొందుతున్నారని ఆమె వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ.10 వేల కోట్ల మేర మహిళలకు ప్రయాణ వ్యయభారం తగ్గిందని తెలిపారు. ఇది కేవలం పథకం మాత్రమే కాదు, మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక స్వేచ్ఛకు దారితీసే కీలక అడుగు అని స్పష్టం చేశారు.

# పులివెందులలో వైఎస్ జగన్

## నేడు 'ప్రజాదర్బార్'

(మొదటిపేజీ తరువాయి)

ఆలస్యం చేయకుండా 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనను కలిసేందుకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు, వికలాంగులు మరియు వృద్ధుల సమస్యలను ఆయన ఓపికగా ఆలకించారు. రాత్రి 7 గంటల వరకు సాగిన ఈ ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వందలాది అర్జీలను స్వీకరించిన జగన్, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. రాత్రికి అక్కడి తన నివాసంలోనే ఆయన బస చేస్తారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన బుధవారం వైఎస్ జగన్ లింగాల మండలంలో పర్యటించనున్నారు. రెండో విడత ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు మరియు అధికార పార్టీ విమర్శల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను సమాయత్తం చేయడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకమవ్వడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యమని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# రహస్యమేమీ లేదు

## న్యాయనిపుణులతో చర్చకే ఢిల్లీకి.. తేల్చేసిన హరీష్ రావు



**హైదరాబాద్, మహా:** రహస్య భేటీలు చేయడం నాకు అలవాటు లేదు. రాత్రి రాహుల్ గాంధీని కలిసి, ఉదయం కేంద్ర మంత్రులను, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలను కలవడం రేవంత్ రెడ్డికే వెన్నతో పెట్టిన విద్య" అని మాజీమంత్రి హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. పనిలేని వారే తన పర్యటనలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన ఢిల్లీ పర్యటనపై సీఎంవో నుంచి వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. నిన్నటి జగిత్యాల సభలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల గురించి అత్యంత హుందాగా మాట్లాడారని హరీష్ రావు పేర్కొన్నారు. జగిత్యాల, కాటారం సభలతో ప్రజలకు ఒక విషయం స్పష్టమైంది. తెలంగాణ కోసం తపించే కేసీఆర్ ఎవరో, చిల్లర మాటలు మాట్లాడే రేవంత్ రెడ్డి ఎవరో అందరికీ తెలిసిపోయింది అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తన ఢిల్లీ పర్యటనపై సీఎంవో ఇచ్చిన లీకులను హరీష్‌రావు కొట్టిపారేశారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి రహస్యం లేదు. ఫిరాయింపుల కేసుపై న్యాయ నిపుణులతో చర్చించేందుకే ఢిల్లీకి వచ్చాను. అందరి కళ్లముందే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విమానం ఎక్కాను తప్ప దొంగచాటుగా వెళ్లలేదు అని స్పష్టం చేశారు. రేపు సుప్రీంకోర్టులో 'ఓటుకు నోటు' కేసు విచారణ ఉందని, అందులో బీఆర్ఎస్ ఇంప్లీడ్ అయిందన్నారు.

# పిఠాపురంలో 'ఫ్లెక్సీ' చిచ్చు

## వర్మపై జనసేన దాడి యత్నం.. వర్మ వర్సెస్ దొరబాబు

(మొదటిపేజీ తరువాయి)

జనసేన శ్రేణుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు మంగళవారం మరోసారి వీధిన పడ్డాయి. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం కాస్తా వ్యక్తిగత దూషణలకు, పరస్పర విమర్శలకు దారితీసి నియోజకవర్గంలో హైటెన్షన్ వాతావరణాన్ని సృష్టించింది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం వేదికగా జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటో లేకపోవడం ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ఎన్ వర్మ మరియు జనసేన నేత పెండెం దొరబాబు మధ్య జరిగిన వాగ్వాదం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే, మంగళవారం పీఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో 'పీఎం అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన' కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్‌పై ప్రధాని మోదీ మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో లేకపోవడంపై ఎస్వీఎస్ఎన్ వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమని, అందులో ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడం ఏంటని అధికారులను ఆయన నిలదీశారు. దీనిపై పీఏడీఏ అధికారులు క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణుగుతుందనుకున్న తరుణంలో, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.వర్మ వద్దకు వచ్చిన పెండెం దొరబాబు.. మీరు కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. పదేపదే ఫోటోల పేరుతో రచ్చ చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించడంతో ఇద్దరు నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వర్మ మరింత ఘాటుగా స్పందిస్తూ, 2024 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఓటమి కోసం పనిచేసిన దొరబాబు, ఇప్పుడు కేవలం తనకున్న రూ.150 కోట్ల ఆర్థిక అక్రమాల కేసుల నుండి తప్పించుకోవడానికే జనసేనలో చేరారని తీవ్ర ఆరోపణలు చేశారు. పిఠాపురంలో తెలుగుదేశం పార్టీ కేడర్‌ను జనసేన నాయకులు కావాలనే విస్మరిస్తున్నారని, కూటమి ధర్మాన్ని పాటించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు వేలు చూపిస్తూ దూషణలకు దిగడంతో పీఏడీఏ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.గత కొద్దికాలంగా పిఠాపురం నియోజకవర్గంలో ఫ్లెక్సీల విషయంలో తమ్ముళ్లు, సైనికుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉంది. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ ప్రతి చిన్న విషయం కూడా చర్చనీయాంశంగా మారుతోంది. గతంలో కూడా శిక్షణ శిబిరాల వద్ద చంద్రబాబు ఫోటోలు స్టాంప్ సైజులో వేశారని వర్మ ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు ఉన్నాయి. తాజాగా జరిగిన ఈ బాహాబాహి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చినప్పటికీ, పిఠాపురంలో ఈ ఇద్దరు నేతల మధ్య నెలకొన్న వైరం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని స్థానిక ప్రజలు ఉత్కంఠగా గమనిస్తున్నారు.

# బూర్గంపహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ...

## రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలి .. జిల్లా కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్ మహా :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ బూర్గంపహాడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యా కార్యక్రమాల అమలు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు పాఠశాలలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్, డ్రాయింగ్ పోటీలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని , మరింత విస్తృతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని సదుపాయాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల కిచెన్ షెడ్‌ను పరిశీలించి, మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాజా కూరగాయల వినియోగం, ఆహార తయారీ, వడ్డింపులో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అలాగే పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై కూడా ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం బూర్గంపహాడ్ వ్యవసాయ కమిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ధాన్యం నాణ్యత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పురోగతి, పెండింగ్ ధాన్యం వివరాలు తెలుసుకుని, సన్న మరియు దొడ్డు రకం ధాన్యాల కొనుగోలుకు వేర్వేరు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, లైటింగ్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్-126 దొడ్డు రకం ధాన్యం నాణ్యతపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి, పిన్‌పాయింట్ డ్యామేజ్ సమస్యపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో స్పష్టత తీసుకువచ్చి రైతులకు నష్టం కలగకుండా చూడాలని తెలిపారు ప్రతి రైతు వద్ద ఉన్న చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, ఎవరూ నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు రిజిస్టర్, రసీదు పుస్తకాలను పరిశీలించి నమోదు విధానాన్ని సమీక్షించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఎంపీడీవో జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ భరోసా అమలు చేయాల్సిందే..

- వీబీజీ రాంజీతో పనికి దూరమవుతున్న పేదలు
- ఉపాధి పని ప్రదేశాలలో వ్యకాస సర్వే



**కారేపల్లి, మహా:** భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటూ ఆశ చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సింగరేణి మండలంలో ఉపాధి పని నిర్వహిస్తున్న ప్రదేశాలలో వ్యకాస సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగి భూమిలేని 22లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికి అరకొరగా అమలు చేశారని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీజీ రాంజీ తో పేదలు ఉపాధి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ లో ప్రతి సారీ నిధులు తగ్గించుకుంటూ వస్తుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు పరచి, విబిజీరాంజీ బిల్లుగా మార్పు చేసి కేంద్రం 60%నిధులు విడుదల చేసి మిగిలిన 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరాయించాలని చెప్పటం సరి కాదన్నారు.

యూపీఏ1 ప్రభుత్వం 2005లో చేసిన చట్టాన్ని యధార్థంగా కొనసాగించాలని ఆయన. డిమాండ్ చేశారు. ఎండల వేడి తీవ్రతతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారని, పని ప్రదేశంలో రెండుసార్లు ఫోటో పద్ధతిని ఎత్తివేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశంలో టెంటు, మంచినీళ్లు మెడికల్ కిట్టు తదితర వసతులు కలిపించాలన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చేపట్టిన సర్వేలో వెలుగులోకి వచ్చిన సమస్యలనీ పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు యనమనగండ్ల రవి, కేసగాని ఉపేందర్నా, నాయకులు పాసిని నాగేశ్వరరావు, చల్లా మల్లమ్మ, షేక్ సైదులు, కరపటి అరుణ, మద్దెల నాగయ్య, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సారపాకలో ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు – మజ్జిగ పంపిణీ



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాకలోని సాకేతపురి నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం జగద్గురువు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాకేతపురి బ్రాహ్మణ సమైక్య అధ్యక్షుడు వెల్ది మోహన్ శర్మ, కార్యదర్శి డి. సాయి కిరణ్ శర్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ఆదిశంకరాచార్యుల జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. శివుడు, కేశవుడు మధ్య ఎలాంటి భేదాలు లేవని, దేవుని దృష్టిలో అందరూ సమానమని, సమాజంలో కులభేదాలు ఉండకూడదని సందేశం ఇచ్చారు.అనంతరం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చల్లని మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో సుమారు 300 మందికి దాహార్తి తీర్చారు.ఈ కార్యక్రమాన్ని సాకేతపురి వర్తక సంఘం, బ్రాహ్మణ సమూహం, హిందూ ఐక్యవేదిక, ఆంజనేయస్వామి సేవా సంఘం, ధర్మ జాగరణ సమితి సంయుక్తంగా నిర్వహించాయి.కార్యక్రమంలో ఎం.వి. సుబ్రహ్మణ్యం, గోపి కిషోర్, తిప్పల నాగేంద్ర రెడ్డి, అయ్యప్ప, సంజయ్, వి. రామారావు, సిలివేరు శ్రీనివాసరావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ యాజమాన్యాన్ని వివరణ కోరిన జాయింట్ కమిషనర్ వరంగల్

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ కర్మాగారంలో జరుగుతున్న 14వ వేతన ఒప్పందం జాప్యం పై ఐఎన్టీయూసీ మిత్రపక్షల ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నాడు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్ (JCL) కార్యాలయంలో సూపరడెంట్ గౌతమి గారికి వినతి పత్రాన్ని అందజేసిన విషయంపై JCL వారు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వవలసిందిగా యాజమాన్యాన్ని కోరడం జరిగింది దానికి సంబంధించిన పత్రాన్ని యాజమాన్యంతో పాటు ఐఎన్టీయూసీ మిత్రపక్షాల వారికి కూడా జేసిఎల్ వారు పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగాఐఎన్టీయూసీ మిత్రపక్షాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు.యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూమా పరిశ్రమలో కార్మికుల విషయంలో గుర్తింపు సంఘం మరియు యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి కార్మికుల హక్కులకు పై భంగం కలుగుతున్నందున JCL వరంగల్ వారు జోక్యం చేసుకొని యాజమాన్యానికి వివరణ కోరినందున ఐఎన్టీయూసీ మిత్రపక్షాల తరఫున JCL వరంగల్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం సమస్యలని త్వరలోనే పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారులు ఎంపీడీవోలు ఏటీఎంలు సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని ముఖ్యంగా ములకలపల్లి అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టెంట్లు తాగునీరు విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు ప్యాడీ క్లీనర్లు తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు. ధాన్యాన్ని తాలు తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# గిరిజన గ్రామాలకు త్రాగునీరు కల్పించాలి..

## ఎమ్మెల్యే పాయం, ఐటీడీఏ పీవోలకు ఐఎఫ్ టియు వినతి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో గొంతెండుతున్న ఆదివాసి, గిరిజన గ్రామాలకు తక్షణం రక్షిత త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఐఏఎస్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో, అలాగే ఐటీడీఏ కార్యాలయంలో ఈ వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల పరిధిలోని అనేక గిరిజన గ్రామాల్లో రక్షిత త్రాగునీటి సౌకర్యం లేక ప్రజలు చెరువులు, కుంటలు, చెలమలలో పరిశుభ్రత లేని నీటిని వినియోగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా మణుగూరు మండలం రామానుజవరం పంచాయతీ పరిధిలోని పెద్దిపల్లి, పగిడేరు సమీపంలోని విప్పలగుంపు, ఖమ్మం తోగు వద్ద బుడుగుల, కూనవరం పంచాయతీ పరిధిలో సర్వాయిగుంపు, రేగులగండి గ్రామాలు తీవ్ర త్రాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అలాగే అశ్వాపురం మండలం కుమ్మరిగుంపు, మనుబోతుల గూడెం, పినపాక మండలం పిట్టతోగు సహా ఇతర గిరిజన గ్రామాల్లో కూడా శాశ్వత త్రాగునీటి పథకాలు అమలు చేయాలని, అప్పటివరకు పంచాయతీల ద్వారా ట్యాంకర్లతో త్రాగునీటి సరఫరా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి రాయన్నపేట వరకు రహదారి నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.30 లక్షల నిధుల పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, రహదారి వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలోని చింతలక్ష్మీనగర్ గ్రామానికి తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు బి జగన్మోహన్ రెడ్డి, కిరణ్ కుమార్, అంగోత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఎస్‌పీలో సేల్ పికింగ్ టెండర్ పై అనిశ్చితి..

- భూ నిర్వాసితులకు ఉపాధి భద్రత కల్పించాలి..
- ఐఎఫ్‌టీయూ డిమాండ్..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలర్స్ మణుగూరు ఏరియా కొండాపురం సిఎస్‌పీలో కొనసాగుతున్న సేల్ పికింగ్ టెండర్‌ను వెంటనే కొనసాగించాలని, భూ నిర్వాసితులు, స్థానికులకు ఉపాధి భద్రత కల్పించాలని ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కెసీఎస్పీ డీజీఎం ఆర్ఎస్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ, కొండాపురం సిఎస్‌పీలో సేల్ పికింగ్ టెండర్ కాంట్రాక్ట్ పనుల ద్వారా సింగరేణి భూ నిర్వాసితులు, స్థానికులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ టెండర్ కొనసాగింపు పై స్పష్టత లేకపోవడం వల్ల కార్మికుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. సివిల్ లేదా నాన్‌సివిల్ టెండర్‌గా ఎలా కొనసాగించాలన్న విషయంలో అనిశ్చితి నెలకొని ఉందని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. టెండర్ కొనసాగింపులో ఆలస్యం జరిగితే భూ నిర్వాసితులు, స్థానిక కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, వెంటనే నిర్ణయం తీసుకుని పనులను నిరవధికంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు సంజీవ్, కాంట్రాక్ట్ కార్మికులు బి నరేష్, ఎం రాజేష్, బి రాములు, వై ఇమ్మానుయేల్, బి తరుణ్, వై బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిసి పీఎస్పీడీ కర్మాగారంలో ఘోర ప్రమాదం – డ్రైవర్ మృతి



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ITC Limited PSPD కర్మాగారంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న ఫైర్ పైప్‌లైన్‌ను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తంబీ మెడ వద్ద తీవ్ర గాయాలతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం అందింది. డ్రైవర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు మరియు ముసలిమడుగు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటిసి గేటు వద్ద ధర్నాకు దిగిన గ్రామస్తులు "మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో కర్మాగారం ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఘటనపై విచారణ ప్రారంభించి ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు ""బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి" అంటూ గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు . కర్మాగారంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న ఫైర్ పైప్‌లైన్‌ను లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది.ప్రమాదంలో లారీ డ్రైవర్ తంబీ మెడ వద్ద తీవ్ర గాయాలతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం అందింది.డ్రైవర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు మరియు ముసలిమడుగు గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటిసి గేటు వద్ద ధర్నాకు దిగిన గ్రామస్తులు "మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో కర్మాగారం ముందు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఘటనపై విచారణ ప్రారంభించి ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# జిల్లా ప్రథమ ర్యాంకర్ విజయభానును సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య..



**తల్లాడ, మహా :** పదో తరగతి సీబీఎస్సీ ఫలితాల్లో ఖమ్మంజిల్లా ప్రథమ స్థానం, ఆల్ ఇండియా ఐదవ స్థానాన్ని దక్కించుకున్న తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం విజయభానును సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సన్మానించారు. మంగళవారం తల్లాడ మండలంలో ఆయన పర్యటించారు. ఈ విషయం తెలుసుకున్న సండ్ర ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమెకు స్వీట్ తినిపించి, శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు రెడ్డెం నారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నాయకులు దుగ్గిదేవర వెంకట లాల్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం ముఖ్య అతిథిగా సర్పంచ్ సుభద్ర



**బూర్గంపహాడ్ మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన శ్రీమతి అనూష - నాగరాజు దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం గ్రామంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ శ్రీమతి బొర్రా సుభద్ర హాజరై గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీమతి భవాని పాల్గొని గృహ యజమానులను అభినందించారు. లబ్ధిదారులు సర్పంచ్ సుభద్ర మరియు కార్యదర్శి భవాని గార్లను శాలువాలతో సన్మానించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డివైండర్ డీకొని... నలుగురుకు తీవ్ర గాయాలు



**నేలకొండపల్లి, మహా :** రోడ్డు ప్రమాదంలో డివైండర్ డీకొన్న ఘటనలో నలుగురు కు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం లోని కొత్తగూడ కు చెందిన నలుగురు యువకులు బైక్ పై మంగళవారం ఖమ్మం నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నేలకొండపల్లి మండల కేంద్రం శివారులో రింగ్ రోడ్డు వద్ద కు రాగానే బైక్ అదుపు తప్పి...డివైండర్ ను డీకొట్టింది. దీంతో నలుగురు కు తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులలో హరి (20), నాగతరుణ్(18), చరణ్(15), మహేందర్(15)లు ఉన్నారు. వీరిలో హరి చెయ్యి బాగా దెబ్బతిన్నది. స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించి ప్రధమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరిలించారు.

# టీజేఎస్ ప్లీనరీకి ప్రతీ గడప నుంచి కదిలిరావాలి



- ఉద్యమ ఆకాంక్షాలను సాధించేందుకు నడుం బిగించాలి
- టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు

**నేలకొండపల్లి, మహా:** హైద్రాబాద్ లో జరగనున్న తెలంగాణ జన సమితీ ప్లీనరీ కి ప్రతీ వాడ,. ప్రతీ ఇంటి నుంచి ఉద్యమకారులు కదిలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు పిలుపునిచ్చారు. మండలం లోని కొత్తకొత్తూరు లో మంగళవారం ప్లీనరీ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు...టీజేఎస్ 4 వ ప్లీనరీ హైద్రాబాద్ లో మే 12 న జరుగుతుందని తెలిపారు. ఈ ప్లీనరీ విజయంతం కోసం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ప్లీనరీ జయప్రదం ను కోరుతూ... గ్రామాలలో విస్తుతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉద్యమ ఆకాంక్షలను సాధించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక తెలంగాణ ను నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పై నిరంతరం పోరు సాగించనున్నట్లు తెలిపారు.ప్రత్యామ్నయ రాజకీయాలకు వేదికగా నిలిచిన టీజేఎస్ ప్లీనరీ తరువాత మరింత బలోపేతం కానున్నట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, మందడి వెంకటేశ్వరరావు. తీగ రాములు, పి.ధనమూర్తి, మల్సూర్, ఆంజనేయులు, యాకయ్య, వెంకటేశ్వర్లు, కర్లపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇంట్లో ఉన్నామనే భావన

## వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎంపీడీఓ



**నేలకొండపల్లి, మహా:** వసతి గృహాలలో విద్యార్థులకు ఇంట్లో ఉన్నామనే భావన కలిగేలా సౌకర్యాలు కల్పించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. స్టోర్ గదులను సందర్శించారు. కూరగాయలు, సరుకుల నాణ్యత ను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వం వసతి గృహాల ను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడోద్దని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వసతి గృహాల ను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమాధికారులు నరేందర్రెడ్డి, మున్నీబేగం తదితరులు పాల్గొన్నారు.

# దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. మణుగూరు మున్సిపాలిటీకి ఫ్రిడ్జ్ వితరణ



## సిబ్బంది, ప్రజలకు చల్లని తాగునీరు..

**మణుగూరు, మహా :** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మణుగూరు మున్సిపాలిటీ సిబ్బంది, వర్కర్లు, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఉపయోగపడే విధంగా దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్‌ను అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దోసపాటి వెంకటేశ్వరరావు అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో దోసపాటి నాగేశ్వరరావు చేతుల మీదుగా మున్సిపాలిటీ కమిషనర్ టి ప్రసాద్‌కు ఫ్రిడ్జ్‌ను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి ప్రసాద్ మాట్లాడుతూ.., మణుగూరు ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. రూ 10 వేల విలువ గల ఫ్రిడ్జ్ ద్వారా సిబ్బంది, వర్కర్లకు చల్లని తాగునీరు అందేలా చేసినందుకు ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కత్తి రాము, బండారు నరసింహారావు, శ్యామ్‌తో పాటు మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## అమ్మో గ్లామర్‌తో చంపేస్తుందిగా..

ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగాలి అంటే తప్పకుండా అందం, అభినయం మాత్రమే కాదు అదృష్టం కూడా కలిసి రావాలి అంటారు.ఇక అందాల ముద్దుగుమ్మ ప్రగ్యాజైస్వాల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఉన్న ఈ చిన్నదానికి లక్కు కలిసిరాలేదని చెప్పాలి.

### ప్రగ్యాజైస్వాల్

మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే తన కంటూ ఓ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.

### మిర్చి లాంటి కుర్రాడు

తన అందం, అభినయంతో అందరి మనసులు దోచేసుకుంది. దీని తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. దీంతో చాలా సినిమాల్లో నటించింది.

### అందం, అభినయం

ముఖ్యంగా వరుణ్ తేజ్ సరసన కంచె మూవీలో నటించి, తన నటతో యూత్ ఫేవరెట్ హీరోయిన్ అయిపోయింది.

### కంచె మూవీ

ఇక ఈ మూవీ తర్వాత అఖండ సినిమాలో నటించి మెప్పించింది. అంతే కాకుండా ఈ మూవీ తర్వాత బాలయ్య సరసన డాకు మహారాజ్ మూవీలో కూడా నటించి మెప్పించింది.

### అఖండ సినిమా

ప్రస్తుతం ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. కానీ తమళం, హిందీ సినిమాలతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది.

### ఫుల్ బిజీ

ఇక ఎప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ అందాల ముద్దుగుమ్మ తాజాగా గోల్డ్ కలర్ డ్రెస్, బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది.



## వరుస సినిమాలతో దూసుకుపోతున్న అందమా మీనాక్షి

మీనాక్షి చౌదరి.. తెలుగులో తిరుగులేని హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది మీనాక్షి చౌదరి. ఈ యంగ్ బ్యూటీ వరుస సినిమాలతో దుమ్మురేపుతోంది. హిట్లు ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా ఆఫర్స్ అందుకుంటూ రాణిస్తుంది అందాల భామ మీనాక్షి చౌదరి. యంగ్ హీరోల సరసన నటిస్తూ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ ఈ అమ్మడు నటిస్తుంది. చివరిగా నవీన్ పోలిశెట్టి హీరోగా నటించిన అనగనగా ఒక రాజు సినిమాలో హీరోయిన్ గా చేసింది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు క్రేజీ ఆఫర్స్ రెడీగాఉన్నాయి. మీనాక్షి ప్రస్తుతం చేతినిండా సినిమాలతో యమా బిజీగా గడుపుతుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఆకట్టుకుంటుంది. నెట్టింట క్రేజీ ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది మీనాక్షి చౌదరి. ఈ ముద్దుగుమ్మ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



## వాడినే పెళ్లి చేసుకుంటా..

కన్నడ పరిశ్రమ నుంచి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, అనతి కాలంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఆషికా రంగనాథ్. 'అమిగోస్' సినిమాతో పరిచయమైంది. నా సామీ రంగా'తో ప్రేక్షకులకు చేరువైన ఈమె, తాజాగా రవితేజ సరసన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో ఇటీవలే ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకుంది. కళ్యాణ్ రామ్ చాలా ప్రైవేట్ పర్సన్ అని, కుటుంబానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని తెలిపింది ఆషికా. నాగార్జున చార్మింగ్ అని, అంత పెద్ద స్టార్ అయ్యుండి కూడా తోటి నటుల గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారని చెప్పకొచ్చింది ఆషికా రంగనాథ్.రవితేజ జీవితాన్ని చాలా ఈజీగా తీసుకుంటారని, సెట్‌లో ఆయన ఉంటే సందడే వేరని పేర్కొన్నారు. కాబోయే భర్త గురించి స్పందిస్తూ ఆషికా కొన్ని ఆసక్తికర నియమాలను బయటపెట్టారు.తనకు కాబోయే భర్త తనను గౌరవించాలని, తన నటన పట్ల ఉన్న ఇష్టాన్ని గౌరవిస్తూ కెరీర్‌లో ప్రోత్సహించాలని కోరుకుంటున్నారు. అలాగే తనకు కొంచెం ఓసీడీ (OCD) ఉందని తెలిపింది. పరిశుభ్రత విషయంలో అస్సలు రాజీపడనని, తన భాగస్వామి కూడా అలాగే ఉండాలని తెలిపారు. తాను పనిచేసిన హీరోలలో నందమూరి కళ్యాణ్ రామ్ 'పర్ఫెక్ట్ హజ్బెండ్ మెటీరియల్' అని అన్నారు. సెట్‌లో మాట్లాడేటప్పుడు ఆయన తన భార్య స్వాతి గురించి గొప్పగా చెబుతారని, తన భర్తలో కూడా కళ్యాణ్ రామ్ గారిలో ఉన్నటువంటి ఉత్తమ లక్షణాలు ఉండాలని అన్నారు.



## బొమ్మ అనుకుంటే పొరపాటే గురూ..

ఏంటీ ఈ ఫొటో చూసి బార్బీ బొమ్మ చాలా బాగుంది అనుకుంటున్నారా? అయితే మీరు పప్పులో కాలు వేసినట్లే, ఎందుకంటే ఈ ఫొటోలో ఉంది క్రేజీ నటి.ఈ ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ, అందాల చిన్నది ఊర్వశీ రౌతేలా. ఈ ముద్దుగుమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే.అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక ఈ అమ్మడు అందానికి ఎవరు అయినా సరే ఫిదా అవ్వాల్సిందే, అంతలా తన క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటుంది.బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించి మెప్పించిన ఈ బ్యూటీ, తెలుగులో స్పెషల్ సాంగ్స్ చేస్తూ అందరి మనసు దోచేసుకుంది.అంతే కాకుండా ఈ అమ్మడు 2015 లో మిస్ దివా యూనివర్సిటీ టైటిల్ కిరీటాన్ని కూడా సొంతం చేసుకుంది.సింగ్ సాబ్ ది గ్రేట్ అనే చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ, వాల్తేరు వీరయ్య మూవీలో నటించి మెప్పించింది.అంతే కాకుండా చాలా సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి, తన డ్యాన్స్, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ తన వైపు తిప్పకుంది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా క్యూట్‌గా ఉండే ఈ చిన్నది అచ్చం బార్బి బొమ్మలా ఉన్న ఫొటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034